విమర్శకాగ్రహించారు. అన్నారు... శ్రీ శ్రీ వెంగయ్యగారూ! పురుషులు శక్తి నతిక్రమించి అరవకాఫీహోటళ్లకు డబ్బును హారతికర్పూరం చేసికోవడం మానాలి. ఆంధ్రులు డబ్బును కూడ బెట్టడానికి అనువైన ప్రచారం ప్రభుత్వమే చెయ్యాలి. అనేక కార్యాచరణ సంఘాలు మన కున్నను అవికూడా పార్టీల గలాటాలకు లోనౌతున్నాయి. వానిని విరమించి సంఘచైతన్యానికి అవి ప్రచారిస్తే బాగుండును. దుస్తులు, ఆహార విహారాదులవంటి స్వల్పవిషయాలలోనే ఆంధ్రులకు విశ్వాసం కలిగేటట్టు చూడాలి. ఆంధ్రత్వం అన్నిటిలో ప్రతిబింబించాలి. ఆడంబరంగా ఖర్చులు చేయరాదని విద్యార్థులకు హితవుకల్పించే ప్రణాళిక విద్యలో ఒక అంశంగా ఉండాలి .. రకరకాల వింతవస్తువులకు స్త్రీలు ఖర్చుపెడుతున్నమాట నిజమేనని ఒప్పుకుంటాను. గృహాలంకరణ ప్రముఖమే కావచ్చు. సంక్రాంతినాటికైనా స్త్రీలు నూతనచైతన్యమునంది దేశీయ వస్తువులను బొమ్మలను కొనడానికే నిర్ణయానికి రావాలి. ఆంధ్రులకళలకు, శిల్పవిద్యలకు నైతిక ప్రచారం కావాలి. రేపు ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెటు నైతికపు విలువలకు ప్రతిరూపంగా ఉంటుందని ఆశిద్దాం... "పొదుపు" అని మా మహిళ యొకామె ఒక్క ఉద్గ్రంథం వ్రాస్తున్నది. దానికి ప్రభుత్వబహుమానంకూడా వచ్చేసూచనలున్నాయి...ఇంతలో సార్! బిల్లుతీసుకోండి .. అన్నాడొక సైకిల్ వాలా.. బావ అందుకున్నాడు. అందుకుంటూనే కండ్లు తేలవేసినట్టు అయినాడు. ఏమా అని చూద్దుంగదా... ఈ నెల మా సంఘ సభ్యులు కాల్చివేసిన కరెంటు బాపతు బిల్లు 118-0-0. ఎలాగ ఇంత విద్యుత్తుకు ఖర్చయిందో? పొదుపునకు మావాళ్ళే ప్రతినిధులనిపించారు.

---

# కాంతికోసం తహతహ

అవసరాల రామకృష్ణారావు

ఆ పండుగ పది రోజులపాటూ నాకు వాళ్లు ముగ్గురూ మూడు కోవెళ్ళదగ్గిర కనిపించేవారు. నేను మీల్సు తీసుకుని హాస్టలుకి తిరిగి వచ్చేస్తూ మూడుకోవెళ్ళదగ్గిరకి వచ్చేసరికి సరిగ్గా ఆరున్నర అయ్యేవి. అప్పుడే హరికథ ప్రారంభించేవారు. ముగ్గురూ పడుచుతనంలో ఉన్న ముత్తైదువులే. ఒకరి చంకనిమాత్రం ఓ చంటిపిల్ల ఉండేది. ముగ్గురి మొహాల్లో మాత్రం ఎంత దాచుకుందామన్నా నిరాశ ప్రతిఫలించేది. నా మనసెందుకో వాళ్ళిచూసే బాధపడి, వాళ్లెవరో ఆరా తీశాను. వారి దీనగాథలు వింటే చాలా దుఃఖమనిపించింది. ముగ్గురూ తోటి కోడళ్లట. అందరు ఆడపిల్లల్లాగే అనేక కలలుకని వాళ్లూ జీవితంలో ప్రవేశించినవారే. ఒక్కరి కోరికలూ చిగురించలేదు. పెద్ద ఆవిడ మొగుడు ఆజన్మాంత రోగిట. రెండో ఆవిడ మొగుడు భార్యా, పిల్లాణ్ణి వదిలేసి పరారీ అయిపోయాట్ట. మూడో అతను నూరు రూపాయలు తెస్తాడు. దాంతోటే ఇంచుమించు అందరూ తినాలి. వీరు ముగ్గురికీ ఒక అధికారం చెలాయించే వెధవాడబడుచూ— ఆవిడ ప్రతీమాట నమ్మే పిచ్చి మామగారూ. ఇంక వారి జీవితాల్లో వెలుతురూ, పరిమళమూ, తృప్తీ ఎక్కడిది? వాళ్లెవరికీ దేముడిమీద పూర్ణ విశ్వాసం లేదు. అయినా ఏదయినా మంచి హరికథ అయితే చాలు-వారు వచ్చి వాలుతారు. ఎందుకు? నాకు మొదట్లో అర్థంకాలేదు.

* * *

మేము అనంతపురంలో ఉంటున్నప్పుడు మాకు నాలుగిళ్లవతల ఓ స్కూళ్ళ పంతులమ్మ. ఆవిడ పెళ్లి చేసుకోలేదు. అలాగే ముసిలిదయిపోయింది. సొంత యిల్లు అంటూ ఒకటి ఆవిడకుంది. ఉద్యోగం అయిపోయింది. మరి ఆవిడ రోజల్లా ఏం చేస్తుందని అడుగుతారేమో! ఇంటి కెళ్ళి చూస్తే ఆవిడ ఏ డిసెంబరు మొక్కకో నీళ్లు పోస్తూనో, ఏ గులాబికో గొప్పు తవ్వుతూనో కనిపిస్తుంది. పువ్వుల మొక్కలు పెంచడమే-

ఆవిడ పని. పూసిన పువ్వులని ఆవిడ ఒక్కటి పెట్టుకోదు. అలా చెట్లని ఉంచేస్తుందా అంటే ఉంచదు. తొమ్మిదిన్నరా అయ్యేసరికి ఆ ఊరి హైస్కూలు పిల్లలంతా అక్కడే ఉండేవారు. "అమ్మగారూ, నాకు, నాకూ!" అని ఆవిడ మీద పడిపోయేవారు. కట్టి ఉంచిన పూలదండలు ఆవిడే స్వయంగా అందరికీ పెట్టేవి. వాళ్లా వెళ్ళిపోగానే ఆవిడ త్వరత్వరగా మేడ ఎక్కేది. లాగులూ, గౌనులూ, పరికిణీలూ, వాణీలూ చీరలూ-యీ రంగులతో పూలరంగుల్ని మేళవించి మురిసిపోయే తూరీగల్ని కనుచూపు దాటిపోయేదాకా చూసేది. తృప్తిగా నిట్టూర్చి మేడ దిగిపోయేది. ఆవిడ మనసులో ఏముంది? ఎవరు చెప్పగలరు?

* * *

శరీరం సరిఅయిన స్థితిలో ఉండడానికీ-సక్రమంగా ఎదగడానికీ పుష్టిగల ఆహారం కావాలని శాస్త్రజ్ఞులు చెబుతారు. కాని మనకు తెలీకుండా మన మనస్సు దాని ఆహారంకోసం అది వెతుక్కుంటూ ఉంటుంది దీన్నే 'ఎక్స్ట్రాఫుడ్" అంటారు మన తత్వవేత్తలు. మనం 'మెదడుకు మేత' అనవచ్చు. ఆహారంలేకుండా కొన్నాళ్లు బ్రతికినవాళ్లున్నారుగాని-యిది లభించక నిమిషాలమీద పిచ్చెత్తిపోయినవాళ్లున్నారు! జీవితంతో ఓడిపోయి, అన్ని ఆశలూ అంతరించిపోయిన తోడికోడళ్లు కష్టాలు దాచుకుని "హరికథ" కోసం రావడందేనికి? ఆ నాలుగు క్షణాల పాటు కష్టాలు మరిచిపోయి "మరో ధోరణి"లో పడిపోదామనేగా! వాడిపోయిన పంతులమ్మ బ్రతుకుబాటలో పుష్పాలు దేనికి? ఆమె మనస్సు ఆ పువ్వుల పంచడం అనే ఒక్క తృప్తికోసం చూస్తోందనేగా?

* * *

అందరూ అర్రులుచాచే యీ "అదనపు ఆహారం" నిష్కామకర్మ అని చెప్పొచ్చు. కాల్చి పారేసిన సిగరెట్ పీకెల పొగలో, యిద్దరు ఆడుతూంటే పదిమంది చూసే చదరంగం ఆటలో, పెద్దకాపు అర్థణా పెట్టి కొనుక్కుని త్రాగే వేడి వేడి బెల్లం టీలో-ఊరి ఆడాళ్ళందరూ కరువుదీరా మాట్లాడుకునే "ఊకదంపుడు"లో చెప్పలేని ఆనందం తప్ప ప్రతి ఫలాపేక్ష ఉందంటే ఎవరు నమ్ముతారు? లేకపోతే మా సుబ్బమ్మగారికి "ప్రక్కయింటివారి పిల్ల లేచిపోయిందనో" "పార్వతమ్మగారి కోడలు నెల తప్పిందనో" యిలాంటి వార్తలు వేడివేడి బటాణీలు తిన్నట్టూ, దేవదాసు నవల చదివినట్టూ ఎందుకుండాలి? ఈ వార్తలు ముందుగా తనకే తెలుస్తే విపరీతమైన ఆనందం పొందడంలో ఆవిడ అంతరార్థం ఏమిటి? పక్కపేటలో ఎవరో ముసలమ్మ చచ్చిపోతే- విచారమన్నది కోసినా లేకపోయినా ఆవిడ ఎలా చచ్చిపోయిందో - ఆవిడ ఆస్తి ఎవరికి దక్కుతుందో వాటచేసుకుని పొట్టపోషించుకునే ఈవిడకెందుకు?

* * *

చేపపిల్లలు ఎప్పుడూ యీదుతూనే ఉంటాయి. పక్షులు ఆకాశంలో వలయాలు తిరుగుతూనే ఉంటాయి. కడుపునిండా అమ్మదగ్గిర పాలు తాగిన పాపాయిలు కాళ్ళూ చేతులూ అలా ఆడిస్తూనే ఉంటారు. మనం ఆ దారిన వెడితే బోసినవ్వుతో పలకరించి ఆకర్షిస్తారు. స్కూలు పిల్లలికి ఆఖరిగంట వినగానే ఒళ్లు పులకరిస్తుంది. కడుపునిండా భోంచేసి 'బ్రేవ్' మని త్రేన్చినా ఉప్పుచెక్క వేసుకుంటేగాని మా బావ భోజనంపూర్తవదు. అరగంట అలంకరించుకున్నా అద్దం పదిమార్లు చూసుకుంటేగాని మా కాంతం అలంకరణ పూర్తి అవదు. గంటసేపు పేపరు చదువుతేగాని మా అన్నయ్యకు నిద్రపట్టదు ఆరోజు పోస్టులో ఉత్తరం రాకపోతే మా అనసూయకు తోచనే తోచదు. ఇవన్నీ ఎందుకు? మన మనస్సు అప్రయత్నంగా అన్వేషించే ఆ 'ఎక్స్ట్రాఫుడ్'కోసమే.

* * *

మనవిచారాల్లోంచి, కష్టాల్లోంచీ-హృదయపు చీకటిలోంచీ బయటికి తొంగిచూడ్డానికి - ఒక్క వెలుతురు కిరణంకోసం మనం సర్వదా ప్రయత్నిస్తాము. అరవై ఏళ్లు దాటిన మా అమ్మా, నాన్నా అతిథిసేవ అమితంగా చేసినా అందుకే- ఎదురింటిగుమాస్తా, భార్యాపిల్లలూ నేలటిక్కెట్టు కొనుక్కుని సెకండుషో సినిమాకి,"కీలు గుర్రాని"కి నాలుగోసారి వెళ్ళినా అందుకే! ★